# సుమంగళీ భవ!!

తలిశెట్టి సభాపతిరావు

ప్రతిదినం వీధిలోని ఇరుగుపొరుగు వాళ్లతో కలిసివొచ్చి గోదావరిలో స్నానం చెయ్యడం; కోవెల్లో పళ్ళిచ్చి ఇంటికి వెళ్లటం ఆఅమ్మాయికి అలవాటు. ఆఅమ్మాయిఅంటే అందరికీ చాల దయ, ప్రేమాను. అందుకు కారణాలు ఆమె సుగుణసంపత్తీ; మృదు మధురమయిన కంఠస్వరం. కొద్దో గొప్పో చదువుకుంది కూడాను. ఆ అమ్మాయి పేరు రాధ.

ఎప్పటిలాగే అంతా బయల్దేరి స్నానా నంతరం కోవెల్లోకి వెళ్ళారు. పూజారి పళ్లెం పడుతూ వచ్చినవాళ్ళని పరీక్షగా చూశాడు. "రాధమ్మ రాలేనట్టుగావుంది" అన్నాడు.

"రాలేదు- పాపం! చాలా విచారిం చింది. తన ఆలయాన్ని, తన బాల్యస్నేహి తుల్ని, గ్రామాన్ని విడిచి వెళ్లలేక వెళ్ళలేక వెళ్లింది. ఇవాళ ప్రొద్దున్న రాధ భర్తవచ్చి తీసుకెళ్ళాడు."

"అత్తారింటికా వెళ్తే!"

"ఆడపిల్ల ఎప్పటికయినా పరులసొత్తే గదండి." అంటూ జవాబిచ్చారు.

రోజులు గడిచినయ్. లెక్కపెడితే సం వత్సరం గడిచిందోలేదో రాధ అత్తవారింటి నుండి వొచ్చేసింది. రాధ స్నేహితురాండ్రు ఎంతో ఘనంగా సారె, చీరలతో అత్తారిళ్ళకి వెళ్ళారు.

ఇంతకీ రాధ రావటానికి కారణం? ప్రతి హిందూ స్త్రీ దేన్నిచూసి తాను హిందూ పత్నిని అని గర్వపడుతుందో, అట్టి కుంకుమ రేఖ రాధవిషయంలో తుడిచివేయబడింది. పాపం! రాధ స్థితి ప్రతిజీవినీ కన్నీరు కార్పిం చింది. రాధ అనాధ!!!

పూర్వం ఆమెఅంటే ఎంతో మోజుపడే వారంతా ఇప్పుడు మూతులువిరుస్తారు. ఆమె మధురమంజుల గానాన్ని విన్నవారంతా ఇప్పుడు "వెధవముండకి పాటలేవిటి?" అన్నా ప్రశ్న. క్రుంగి కృసించిపోయింది. దేదీప్య మానంగా, జ్యోతుల్లా మెరిసే ఆమె కళ్ళల్లో నేడు అంధకారం నెలకొనివుంది. నిగనిగ లాడు ఆమె శరీరచ్ఛాయ నేడు అంతరించి పోయింది. అప్పటి సౌందర్యదేవత, ఈనాడు బక్కచిక్కిన దుఃఖమూర్తి!!

రాధ భర్త పేరుపొందిన వర్తకుడు. రంగూన్, బర్మాలతో ఎక్కువ రాకపోక లున్నాయి. ఎప్పటిలాగే రంగూన్ పోతు న్నారు. మధ్యలో భయంకరమయిన తుఫాన్. సముద్రం పొంగిపొర్లింది. ఓడనువిసిరికొట్టింది. అంతే! అంతూ-దరీ లేకుండాపోయింది. "ఓడ లోనివారంతా మరణించారు" అన్న వార్త బయల్పడింది!

నెలలూ, సంవత్సరాలూ గడిచినయ్?

ఒకరోజు ఆగ్రామంలో "స్వాములవారు వచ్చారు! స్వాములవారు వచ్చారు!" అన్నారు. ప్రజలు తండోపతండాలుగా వెళ్లి దర్శిస్తున్నారు. ఆయనకీర్తి వేనోళ్ళ చెప్పు కుంటున్నారు. పురాణపఠనంలో పెట్టింది పేరు. గీతాపఠనంలో అందెవేసిన చేయి.

రాధకీవార్త తెలిసింది. ఎలాగయినా వెళ్లి ఆయనదర్శనం చెయ్యాలి అని తహతహ

లాడిపోయింది. రాధ స్నేహితురాండ్రు వెళ్ళారు. చూసారు.

"వేణీ! ఎంత అందమయిన ముఖం. ఇంత చిన్నతనంలోనే సన్యసించడం గొప్ప సంగతి సుమా!"

"సుభద్రా! చూస్తూ చూస్తూవుంటే-పాపం!- రాధభర్తకీ ఈయనకీ ఆగెడ్డం తప్ప అన్నీ పోలికలే. మూడుమూర్తులా అలాగే వున్నాడు!"

"అవును. ఎలాయితేం రాధ అనాధ!! పాపం!"

ఎవరికితోచినట్టు వారు పలికారు.

స్వాములవారొచ్చిన మూడో రోజు రాత్రి. వెన్నెల అప్పుడప్పుడే వ్యాపిస్తూంది. వూరిచివర వున్న కోనేటిగట్టుమీద ఇంకా చీకట్లే వున్నయ్. కోనేటిమెట్లమీద ఒక స్త్రీ మూర్తి కూర్చునివుంది నిశ్శబ్దంగా. ఇంతలో "టక్! టక్!" మని పావుకోళ్లు శబ్దంతో స్వామిజీ స్నానానికి వచ్చారు. చూశారు ఆ స్త్రీని.

"ఎవరు?..."

"స్వామిజీ! నమస్కారం." అంటూ పాదాలమీద పడింది.

"సుమంగళీభవ!!" దీవించాడు స్వామిజీ.

ఆశ్చర్యపోయింది రాధ. "స్వామిజీ! నేనొక అనాధ...".

"అమ్మా! నీబాధ నాకు తెలియక పోలేదు." మెల్లిగా సాగిపోయాడు స్వామిజీ.

'తెలిసివుండీ కూడా ఎందుకలా దీవించాడా' అని ఆమెహృదయం పరిపరివిధాల పోయింది. ఎంతో ఆలోచించింది, లాభం లేకపోయింది. ఆనాటినుండీ ఎంతో భక్తిశ్రద్ధలతో సేవించడం మొదలుపెట్టింది స్వామిజీని. స్వామిజీ కూడా రాధని ఎంతో ప్రేమించేవాడు.

ఒకరోజు రాత్రి. స్వామిజీ, రాధా; ఇద్దరూ పూలవనంలో ప్రేమగీతాలు పాడుకుంటూ విహరిస్తున్నారు. పుచ్చపువ్వులాంటి వెన్నెల. తిరిగి తిరిగి అలసిపొయ్యారు. మాలతీలత దగ్గరకి చేరారు. ఒకరికౌగిలిలో ఒకరు ఎంతో ఆనందంగా నిద్రపొయ్యారు. ఇంతలో వెన్నెల మాయమయింది. గాఢాంధకారం. చిటపట చినుకులు. గాలిదుమారం. 'టక్' మని మెలుకువవచ్చింది రాధకి. ఆశ్చర్యం!!-భయం!!-తో చుట్టుప్రక్కల జూసింది. ఏదీమార్పులేదు. తన గదీ, తన మంచం, తనూ. స్వామిజీ ఏడీ?— ఈ కలకి అర్థం ఏమిటీ? అంటూ తహతహలాడిందామె మనస్సు. తనెంతో తప్పు చేసినదానిలాగా గజగజ వడికింది. స్వామిజీని దర్శించడం మానుకుంది.

వారంరోజులు గడిచినయ్. స్వామిజీ రాధకి కబురుపెట్టాడు. ముందు వెళ్ళకూడదనుకుంది. కాని ఆరాత్రి తనకి తెలియకుండానే బయల్దేరి వెళ్ళింది.

"స్వామిజీ! నమస్కారం."

"సుమంగళీభవ!" మళ్ళీ అదే దీవన. రాధా! నీస్వామిసేవలో ఇంతమరుపెలా కలిగింది?"

"........",

"రాధా! ఏడుస్తావెందుకు?"

స్వామిజీ! నేనొక పాపిని. తమ సేవ చెయ్యడానికి నాకు హక్కులేదు.” గొల్లుమంది కాళ్ళమీదపడి.

“రాధా! పాపివా? కారణం?”

“ఏంలేదు స్వామీ?”

“లేదూ!...రాధా! ఇది పరీక్షాసమయం అనుకో.”

“చెప్పలేను స్వామీ!”

“రాధా! చెప్పు. నేశాసిస్తూన్నా” గర్జించాడు స్వామిజీ.

భయపడింది రాధ. “స్వామీ! పోయిన రాత్రి మీరు, నేను పూలవనంలో ప్రేమ విహారం సలిపినట్లు కల. కలఅప్పుడేపోయింది. అదృశ్యం మాత్రం నాహృదయాన్ని కలచి వేస్తున్నది స్వామిజీ!”

“రాధా!...” కన్నీళ్ళు రాలినయ్ స్వామిజీ నయనాల్లోంచి. లేవనెత్తాడు. “రాధా! నువ్వు నిత్యసుమంగళివి” అంటూ తననంచిలోని భరిణెలో కుంకుమ తీసి ఆమె నుదుటిమీద దిద్దేడు.

“స్వామీ! లోకం నన్నో వితంతువుగా చూస్తోందే?”

“పాడులోకం. విడిచిపెట్టు. నీదేవుడే నీకు లోకం. నీ ప్రాణం. నీ జీవనజ్యోతి. అతడ్నే పూజించు. అదే ముక్తిమార్గం.”

“స్వామీ! అంతేనా”

“అంతే రాధా! అంతే!- మళ్ళీ నన్నీ పాడుసంసార బంధంలోకి దించకు. నాకీ లోకంఅంటే విరక్తిపుట్టింది. నన్ను సాగిపోనియ్”.

“నాధా!...”

“రాధా! సావిత్రి, అనసూయల జీవితాన్ని ఆదర్శకంగా తీసుకో. నీ జీవితాన్ని నిర్మలంగా గడుపు. ఇహలోకంలో మనిద్దరి జీవితాలూ ఇలాగే గడుపుదాం...సుమంగళీ భవ! రాధా! వెళ్ళు.

స్వామిజీ సాగిపోయ్యాడు. అది అంతు (Destination) లేని ప్రయాణం. పోతూన్న స్వామిజీని చూస్తూ అలాగే నిలబడిపోయింది రాధ. కన్నీటిబిందువులు ఆమె చెక్కిళ్ళ మీద, ఆవెన్నెట్లో ముత్యాల్లాగ మెరసినయ్. అవి ఆనందబాష్పాలో-అశ్రుబిందువులో !!!


త్వరపడి నేడే ఆర్డరీయండి!



లీవర్ గడియారము. సరియైన టైము చూపుతుంది. చతురము లేక గుండ్రని రిస్టువాచి రు 12-8-0. రు 15/- బంగారపు కేసుది రు 16-8-0: రోల్డుగోల్డు ప్లేటుది రు 18/- నికిల్ జేబు గడియారం రు 7-8-0. 5 సం॥ గ్యారంటీ. పోస్టేజి ప్యాకింగు 0-11-0 అణాలు. 2 గడియారాలకైతే ఉచితం.

**Culcutta Clock Co.,**
(Sec. 546)
Post Box No. 12203,
CULCUTTA.